

పాలకుర్తిలోని ప్రభుత్వ వైద్యశాల

# పాలకుర్తి దవాఖాన 50పడకలుగా అప్‌గ్రేడ్

- ఫలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషి...
- అందుబాటులోకి రానున్న మేరుగైన వైద్య సేవలు

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం విద్య వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. స్వరాష్ట్రం సాధించిన నాటి నుంచి ఉద్యమ నాయకుడు కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి విద్య వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు అభివృద్ధిని సాధిస్తున్నాయి. ప్రతి నియోజక వర్గానికి 100పడకల దవాఖాన మంజూరు చేస్తానని మాట ఇచ్చిన సీఎం కేసీఆర్ ఆ దిశగా తొర్రూరులో 100పడకల దవాఖానను ఇటీవల మంజూరు చేశాడు. తొర్రూరులోనే కాకుండా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి నీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టుబట్టి తొర్రూరుతో పాటు పాలకుర్తికి వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఒప్పించి 50పడకల దవాఖానను మంజూరు చేశాడు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు ఈ నెల 4వ తేదీన వల్మిడిలోని రామాలయ ప్రారంభోత్సవానికి రాగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తిలో 50పడకల దవాఖానను మంజూరు చేయాలని కోరగా మంత్రి సానూకూలంగా స్పందించాడు. మంత్రి ఎర్రబెల్లి మాట ప్రకారం పాలకుర్తికి 50పడకల దవాఖానగా ఈ నెల 4వ తేదీన వైద్య విదాన పరిషత్ నుంచి జీఓను విడుదల చేశారు. నియోజక వర్గ కేంద్రమైన పాలకుర్తిలోని వైద్యశాల దశాబ్ధ కాలంగా 30పడకలకే పరిమితమైంది. పాలకుర్తి జనాభా 12వేలు ఉంది. మండల జనాభా 60వేల ఉంది.పాలకుర్తి మండలంలోని 36గ్రామ పంచాయతీలతో పాటు పక్క మండలాలైన దేవరుప్పుల కొడకండ్ల రాయపర్తి మండలాల నుంచి రోగులు చికిత్స కోసం దవాఖానకు వస్తుంటారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒత్తిడి మేరకు మంత్రి టి హరీశ్‌రావు 50పడకలుగా ఈ నెల 4వ తేదీన జీఓ విడుదల చేశారు.

**అందుబాటులోకి వైద్య సేవలు....**

పాలకుర్తి ప్రభుత్వ దవాఖాన 30పడకల నుంచి (సామాజిక ఆరోగ్య కేంద్రం)50పడకలుగా అప్‌గ్రేడ్ కావడంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు మేరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలోనే మంత్రి ఎర్రబెల్లి పాలకుర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం గదిని ప్రారంభించారు. కొంత సిబ్బంది లేకపోవడంతో పోస్టు మార్టం సేవలు అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం 50పడకలు కావడంతో వైద్య సేవలతో పాటు పోస్టు మార్టం సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. డాక్టర్ల సంఖ్య కూడా పెరగనుంది. వైద్య సిబ్బంది కూడా పెరగనుంది. ఇప్పటికే ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్య మహిళ క్లినిక్ సేవలు, ప్రసవాలు, కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వంటి కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు దవాఖానకు 200నుంచి 300వరకు ఓపీ ఉంటుంది. 30పడకల దవాఖాన 50పడకలుగా మారడంతో మండల ప్రజలతో పాటు బీఆర్‌ఎస్ శ్రేణులు ఎంపీపీ నల్లానాగిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ వీరమనేని యాకాంతారావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజాశీస్సులతో మళ్లీ సీఎంగా కేసీఆరే..

- బీఆర్‌ఎస్ పాలన దేశానికే దిక్సూచి
- తెలంగాణలో మతతత్వ బీజేపీకి స్థానం లేదు..కాంగ్రెస్ అవసరమే లేదు...
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ, అక్టోబర్ 5: రాష్ట్రంలో సుభిక్షమైన పాలన అందజేస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన సీఎం కేసీఆర్ పాలన దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మున్సిపల్‌కేంద్రంతో పాటు మండలంలోని తానంచర్ల, గుండెపూడి, ఉల్లేపల్లి, వెంకంపాడు, అబ్బాయిపాలెం గ్రామాల్లో రూ.50కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇండోర్ స్టేడియంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెలు, యువతకు క్రీడా సామగ్రి, గృహలక్ష్మీ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. మున్సిపల్ కేంద్రంలో రూ.9.75కోట్లతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, ఉల్లేపల్లి-మన్నెగూడెం గ్రామల మధ్య ఆకేరువాగుపై రూ.15కోట్లతో హై లేవల్ బ్రిడ్జి నిర్మాణం, ఉమ్మడి తానంచర్ల గ్రామంలో రూ.5కోట్లతొ తారురోడ్డు పనులు, మరిపెడ మున్సిపల్ కేంద్రం నుంచి ఆనేపురం వరకు రూ.89లక్షలు, రూ.25లక్షల వెంకపాడు భవనం, రాంపూరం నుంచి నర్సింహులపేట మండలం దాట్ల వరకు రూ.2కోట్లు, రాంపూరం నుంచి కొత్తపల్లి వరకు రూ.కోటి నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి మారుమూల తండాకు తారు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత డోర్నకల్ నియోజకవర్గానికే దక్కిందన్నారు. దళితబంధు పథకం ద్వారా 1200మందికి లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్ల కాలంలోనే తెలంగాణను దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా నిలిపిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం ముచ్చటగా మూడోమారు అధికారంలోకి రానున్నదన్నారు.

# తీరిన రైతుల కష్టాలు

**ఎంపీ మాలోత్ కవిత**

మరిపెడ, అక్టోబర్ 5 : మరిపెడ, చిన్నగూడూరు మండలాల సరిహద్దు గ్రామాలైన ఉల్లేపల్లి-మన్నెగూడెం గ్రామస్తుల కష్టాలు డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కృషితో తీరనున్నట్లు ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత తెలిపారు. గురువారం మండలంలోని ఉల్లేపల్లి-మన్నెగూడెం గ్రామాల మధ్య ఆకేరువాగుపై రూ.15 కోట్లతో నిర్మించనున్న హై లెవల్ వంతెన శంకుస్థాపన పనులను ఎమ్మెల్యేతో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రెండు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం సీఎం కేసీఆర్‌ను ఒప్పించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రైతులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్పంచ్ మొదలు సమితి అధ్యక్షుడు, ఐదుమార్లు ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ఎమ్మెల్యే రెడ్యానాయక్ అనునిత్యం నియోజకవర్గంలోని ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను ప్రజలు దీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీ గుగులోత్ అరుణా రాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్ పాల్గొన్నారు.


ఉల్లేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ కవిత పక్కన ఎమ్మెల్యే రెడ్యానాయక్

# పాలకుర్తిలో కాంగ్రెస్ ఖాళీ

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్‌ఎస్ భారీగా చేరికలు

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 5 : రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఖాళీ కావడం ఖాయమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి నీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నర్సింగపురం, అయ్యంగారిపల్లి, దుబ్బతండా బీ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి ఎర్రబెల్లి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో తాను చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నట్లు తెలిపారు. తనను నమ్ముకుని పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని, సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అడ్రస్ గల్లంతైందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమన్నారు. మాయమాటల కాంగ్రెస్‌ను, మోసాల బీజేపీని ప్రజలు తరిమికొట్టాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో తిరుగుతున్న కొత్త బిచ్చగాళ్లను ప్రజలు పట్టించుకోరని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం కడుతారని పేర్కొన్నారు. నర్సింగపురం నుంచి బాదావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో 100మంది, లక్ష్మినారాయణపురం నుంచి తుడి ఉపేందర్ ఆధ్వర్యంలో 50 మంది, దుబ్బతండా బీ నుంచి బానోత్ సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో 50మంది, 200 మంది కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. విస్నూరులో కొడకండ్ల మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవ రావు సమక్షంలో 20మంది కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, సీనియర్ నాయకుడు గజ్జి సంతోష్‌కుమార్, సర్పంచ్ నకీర్త యాకయ్య, ఎంపీటీసీ మాటూరి యాకయ్య పాల్గొన్నారు.


ఎర్రబెల్లి సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నర్సింగపురం, లక్ష్మీనారాయణపురం దుబ్బతండా బీ గ్రామాల నాయకులు, కార్యకర్తలు

# పెంబర్తికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

- హస్తకళల అభివృద్ధికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ రూరల్, అక్టోబర్ 5: పెంబర్తి కళాకారులు తయారు చేసే వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని, పెంబర్తి పేరును ప్రపంచవ్యాప్తం చేసేందుకు ఇక్కడి కళాకారులు చేసిన కృషిని మరువమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెంబర్తి గ్రామంలో ఇటీవల జాతీయస్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామ అవార్డు రావడంతో గ్రామ ప్రజాప్రతినిధులతోపాటు హస్తకళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు. వృద్ధ కళాకారుల కాళ్లు మొక్కారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇక్కడ తయారు చేసే వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని, అలాగే యాదాద్రి జిల్లా అభివృద్ధి పనులకు ఇక్కడి వెండి, కంచు వస్తువులు వాడినట్లు తెలిపారు. గతంలో రూ.5 కోట్లు కేటాయించామని, మరోసారి రెట్టింపు డబ్బులు విడుదల చేయడానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడి హస్తకళాకారులకు మరింత ఉపాధి కల్పించేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, సర్పంచ్ అంబాల ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ మూల రవిగౌడ్, ఉప సర్పంచ్ చినబోయిన రేఖ, పంచాయతీ కార్యదర్శి ప్రఫుల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చినబోయిన నర్సయ్య, నాయకులు కొండబోయిన రాజుయాదవ్, మంద లక్ష్మణ్, కిషన్, ఆకుల శ్రవణ్, వంశీధర్‌రెడ్డి, బాబన్న, కూర రాజు, బుడిగే శ్రీను, సంపత్, బాలు, రాజు, మల్లేశ్, వేణు, సత్యనారయణ, రవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


పెంబర్తిలో వృద్ధ కళాకారుడి కాళ్లు మొక్కుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

# అథ్లెటిక్స్‌లో ఏబీవీ విద్యార్థికి బంగారు పతకం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : కరీంనగర్ జిల్లాలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి తొమ్మిదవ అథ్లెటిక్స్ పోటీల్లో జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఉదయ్ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య గురువారం తెలిపారు. పురుషుల విభాగం 1500 మీటర్ల రన్నింగ్ పోటీలో బంగారు పతకాన్ని పొందడంతో పాటు 800 మీటర్లలో కాంస్య పతకాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చిన ఉదయ్‌ని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులు తదితరులు అభినందించారు.


ఉదయ్‌ని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య, అధ్యాపకులు